# శివారు ప్రాంతాల్లో 'డ్రోన్' నిఘా



డ్రోన్‌తో మందు బాబుల అడ్డాను గుర్తించి దాడి చేసిన పోలీసులు (ఫైల్)

- నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట
- శివారు ప్రాంతాలపై ప్రత్యేక నజర్
- అల్లర్లకు పాల్పడే వారిపై కేసులు నమోదు
- డ్రోన్ కెమెరాలతో పోలీసుల పకడ్బందీ పర్యవేక్షణ
- శోభాయాత్రలు, ర్యాలీలపై సైతం నిఘా

నిజామాబాద్ క్రైం, డిసెంబర్ 12 : నిజామాబాద్ జిల్లాలో నేరాలను నియంత్రించేందుకు కొంత కాలం క్రితం నుంచి పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలో జరుగుతున్న చట్టవ్యతిరేక కార్యకలాపాలను పసిగట్టేందుకు ప్రత్యేకంగా 'డ్రోన్ నిఘా'ను వినియోగిస్తున్నారు. ప్రధానంగా గ్రామాలు, మండలాలతో పాటు నగర శివారు ఏరియాలు, అటవీ ప్రాంతాల మాటున ఇప్పటి వరకు జరిగిన పేకాట, కోళ్ల పందేలు లాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలను గుర్తించేందుకు పోలీసులు అక్కడి వరకు వెళ్లకుండా తాము ఉన్న చోటి నుంచే దృష్టి సారిస్తున్నారు. అందు కోసం పోలీస్ కమిషనర్ ఆదేశాలతో మూడు డివిజన్ల ఏసీపీల పర్యవేక్షణలో సంబంధిత సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ఆ ఏరియాల ఎస్సైలు తమ సిబ్బందితో కలిసి డ్రోన్ ద్వారా నగర, గ్రామ శివారు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఈ కెమెరా ద్వారా శివారు ప్రాంతాల్లో మారుమూల ఏరియాలో గుట్టు చప్పుడు కాకుండా జరగుతున్న చట్టవ్యతిరేక కార్యకలాపాలను సులువుగా గుర్తిస్తున్నారు.

**పోలీసుల రాకతో పారిపోయే అవకాశాలు ఎక్కువే..**

కొంత మంది జూదరులు అటు పోలీసులు, ఇటు చుట్టు పక్కల ఉండే వారికి తెలియకుండా శివారు, నిర్మానుష్య ప్రాంతాల్లో పేకాట స్థావరాలను ఏర్పాటు చేసుకుంటారు.అలాంటి వారి సమాచారం ఎవరికీ తెలియకుండా గోప్యంగానే ఉంటుంది. అయితే ఇలాంటి పేకాట రాయుళ్ల అడ్డాలను తెలుసుకొని పోలీసులు దాడి చేసేందుకు వారి పరిసర ప్రాంతాలకు వెళ్తుంటారు. అలాంటి సమయంలో పేకాటరాయుళ్లు తమ అడ్డాల నుంచి పారిపోయిన సంఘటనలు సైతం లేకపోలేదు.

ఇది గ్రహించిన పోలీసులు కొత్త టెక్నాలజీ ద్వారా శివారు ఏరియాలో పేకాట ఆడుతున్న వారిని గుర్తించేందుకు డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నారు. ఈ డ్రోన్లను తమ వద్ద ఉండే రిమోట్ కంట్రోల్ ద్వారా పోలీసులు ఆపరేట్ చేస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్న స్థావరాలను గుర్తిస్తున్నారు. దీంతో డ్రోన్ వారు ఉండే ప్రాంతాలను కవర్ చేస్తూ అందులో ఉన్న కెమెరాల ద్వారా వారి ఫొటోలను తీస్తుంది. దీంతో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారు డ్రోన్ కెమెరా సహాయంతో పోలీసులకు దొరికిపోతున్నారు.

**బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారి అడ్డాలు గుర్తింపు..**

చాలామంది మందుబాబులు అనుమతి పొంది బార్లలో కాకుండా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సిట్టింగులు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో ఆ ప్రాంతాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. ఇలాంటి వారి మద్యం సిట్టింగ్ స్థావరాలను గుర్తించేందుకు సైతం పోలీసులు డ్రోన్ కెమెరాలను వినియోగిస్తూ వారిని పట్టుకొని కేసులు నమోదు చేసిన సంఘటనలు సైతం చాలా ఉన్నాయి.

**శోభాయాత్రలు, ర్యాలీలపై సైతం నిఘా**

ర్యాలీలు, శోభాయాత్రల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు డ్రోన్ కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా పెడుతున్నారు. అనుకోకుండా ఏదైనా సంఘటన జరిగితే దానికి కారకులైన వారిని సులువుగా గుర్తించేందుకు ఈ డ్రోన్ కెమెరాలు చాలా ఉపయోగపడుతున్నాయి. ప్రధానంగా జిల్లాలో ప్రతి ఏడాది వేలాది మంది భక్తులు, జనం పాల్గొనే గణేశ్ నిమజ్జన శోభాయాత్ర, హన్మాన్ జయంతి లాంటి ఉత్సవాల సమయంలో ప్రతి ఒక్కరిపై నిఘా పెట్టేందుకు సైతం ఈ డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. జనంలోకి వెళ్లేందుకు వీలుపడకపోవడంతో ఈ వినూత్న చర్యలు చేపట్టారు. ర్యాలీలు,శోభాయాత్రలు నిర్వహించే ఏరియాలో పోలీసులు డ్రోన్ కెమెరాల ద్వారా జనం కదలికల పై నిఘా పెడుతున్నారు. దీని ద్వారా ఎవరు ఏ వైపు నుంచి వస్తున్నారు, ఏ ప్రాంతంలో ఎంత మంది జనం శోభాయాత్ర, ర్యాలీలోకి వచ్చి చేరారనే సమాచారాన్ని పోలీసులు పసిగడుతున్నారు.

**ఇప్పటి వరకు చాలా చోట్ల కేసులు నమోదు ..**

డ్రోన్ కెమెరాలను వినియోగించి పోలీసులు ఇప్పటి వరకు చాలా ప్రాంతాల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలను గుర్తించిన దాఖలాలు ఉన్నాయి. పలు పోలీస్ స్టేషన్ల పరిధిలోని శివారు ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న వారిని డ్రోన్ ద్వారా గుర్తించి వారిని పట్టుకొని కేసులు నమోదు చేశారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ జనానికి ఇబ్బందులు కలిగించే వారిని సైతం డ్రోన్ సహాయంతో పసిగట్టి వారి పై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించడంతో పాటు కోర్టులో సైతం హాజరుపరిచారు.

**కరోనా సమయంలో సైతం డ్రోన్ వినియోగం**

2020లో కరోనా విజృంభించిన సమయంలో సైతం పోలీసులు ఈ డ్రోన్ కెమెరాల ద్వారా జనం ఇండ్ల నుంచి బయటికి రాకుండా కట్టడి చేశారు. ఆ సమయంలో అన్ని ప్రాంతాల్లోకి పోలీసులు వెళ్లేందుకు వీలు లేకపోవడంతో ఎక్కడైనా జనం ఇండ్ల నుంచి బయటికి వచ్చినట్లయితే వారిని గుర్తించేందుకు డ్రోన్ కెమెరాలను పోలీసులు వినియోగించారు. అంతే కాకుండా నిబంధనలు అతిక్రమించి ఇండ్లలోంచి బయటికి వచ్చి వారిని గుర్తించి వారిపై కేసులు సైతం నమోదు చేశారు.

### నేరాల నియంత్రణకు డ్రోన్ సహాయం

జిల్లాలో నేరాలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలు, నేరాల నియంత్రణకు డ్రోన్ ఎంతో సహాయపడుతున్నది. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే పూర్తి సమాచారం, ఫొటోలతో సహా పోలీసులు నిమిషాల్లో తమ వద్దకు తెప్పించుకుంటున్నారు. ప్రజలకు ఎల్లవేళలా పోలీసులు రక్షణగా ఉన్నారనే భరోసా కల్పించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం రాత్రింబవళ్లు పని చేస్తుంది.

-కల్మేశ్వర్, సీపీ



# చెరువు శిఖం భూమి కబ్జాపై ఆర్డీవో విచారణ



సారంగాపూర్ పెద్ద చెరువు శిఖం భూమిని పరిశీలిస్తున్న ఆర్డీవో రాజేంద్రకుమార్

నిజామాబాద్ రూరల్, డిసెంబర్ 12 : నిజామాబాద్ మండలంలోని సారంగాపూర్ పెద్దచెరువు శిఖం భూమి కబ్జాకు గురైందని గ్రామస్తులు సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో రాజేంద్రకుమార్ మంగళవారం విచారణ చేపట్టారు. శిఖం భూమిని కబ్జాచేసి ప్లాట్లుగా మార్చేందుకు జేసీబీ సహాయంతో చదును చేస్తున్నారని ఆర్డీవోకు గ్రామస్తులు వివరించారు. చెరువు భూమిని కబ్జా చేస్తే ఊరుకునేది లేదన్నారు. అయితే, పట్టా భూమిలోనే తాను ప్లాట్ల కోసం చదును చేస్తున్నానని ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి అధికారులకు వివరణ ఇచ్చాడు. ఇరువురి వాదనలు విన్న నీటిపారుదల శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు.. రికార్డుల ప్రకారం సర్వే చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్డీవో వెంట నాయబ్ తహసీల్దార్ రంజిత్‌కుమార్, గిర్దావర్ హరీశ్‌రెడ్డి, సర్వేయర్ ప్రణీత, డిప్యూటీ సర్వేయర్ శ్రీనివాస్, గ్రామపెద్దలు శ్రీనివాస్‌గౌడ్, రవి, సుదర్శన్ తదితరులున్నారు.

# న్యాక్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

వేల్పూర్/ భీమ్‌గల్, డిసెంబర్ 12 : ఈజీఎంఎం ద్వారా గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు న్యాక్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ, ఉపాధి కల్పించనున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్, రెండు ఫొటోలతో కొత్త కలెక్టరేట్ వద్ద ఐటీ టవర్స్ పక్కన శిక్షణ కేంద్రం(న్యాక్)లో ఈనెల 18లోగా సంప్రదించాలని సూచించారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు ఉచిత హాస్టల్ వసతి, స్టేషనరీ (బుక్, పెన్) యూనిఫాం (టీషర్ట్స్, బ్యాగ్స్) ఉచితంగా ఇస్తారని తెలిపారు. ఎలక్ట్రికల్ విభాగం(హౌస్ వైరింగ్, ఫ్యాన్, ఏసీ రిపేర్, ట్రాన్స్‌ఫార్మర్)ల్యాండ్ సర్వేయర్ విభాగం (ఆటో లెవల్, ఆఫ్‌సెట్ సర్వేయింగ్, ట్రవెర్సింగ్)లో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ల్యాండ్ సర్వేయర్‌కు (3నెలలు), ఇంటర్మీడియట్, డిగ్రీ, 18 నుంచి 35 ఏండ్ల వయస్సు కలిగి ఉండాలని తెలిపారు.అసిస్టెంట్ ఎలక్ట్రిషియన్‌కు (3 నెలలు) ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్, 18నుంచి 36 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు.

శిక్షణ అనంతరం సర్టిఫికెట్లతో పాటు పలు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తారని తెలిపారు. వివరాలకు సరోజ ల్యాండ్ సర్వేయర్ ( 7981360101), లింబాద్రి, ఎలక్ట్రీకల్ (8498867895), భీమ్‌గల్ దిలీప్ 9704587655, ప్రభాకర్ 6281992068 లను సంప్రదించాలని సూచించారు.

# ముగిసిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు

రామారెడ్డి, డిసెంబర్ 12 : మండలంలోని ఉప్పల్‌వాయి గ్రామంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షే మ గురుకుల పాఠశాలలో నాలుగు రోజుల నుంచి కొనసాగుతున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి సాంఘిక సంక్షేమ గురుకులాల జాయింట్ సెక్రెటరీ సక్రూ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల్లో గెలుపోటములు సహజమన్నారు. ఓటమి గెలుపునకు నాంది అని అన్నారు. అనంతరం ఆయన విజేతల కు బహుమతులు ప్రదానం చేశారు. నిజామాబాద్ రీజినల్ కో ఆర్డినేటర్ అలివేలు, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, జడ్పీటీసీ మోహన్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కన్వీనర్ గురజాల నారాయణరెడ్డి, సర్పంచ్ గంగారాం వైస్ ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

## పీజీ పరీక్షల ఫీజు గడువు పెంపు

డిచ్‌పల్లి, డిసెంబర్ 12 : టీయూ పరిధిలో అనుబంధ కళాశాలల్లో పీజీ పరీక్షల ఫీజు గడువును ఈ నెల 15 వరకు పొడిగించినట్లు పరీక్షల నియంత్రణాధికారిణి ఆచార్య అరుణ తెలిపారు. అపరాధ రుసుముతో 18 వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్, టీయూ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

## ప్రీ పీహెచ్‌డీ పరీక్షా ఫలితాల విడుదల

డిచ్‌పల్లి, డిసెంబర్ 12 : టీయూలో అక్టోబర్ 5 నుంచి 7 వరకు నిర్వహించిన ప్రీ–పీహెచ్‌డీ పరీక్షా ఫలితాలను రిజిస్ట్రార్ ఆచార్య ఎం.యాదగిరి, ఎగ్జామినేషన్ కంట్రోలర్ ఆచార్య ఎం.అరుణ మంగళవారం విడుదల చేశారు. 16 సబ్జెక్టుల్లో 137 మంది పీహెచ్‌డీ స్కాలర్స్ హాజరు కాగా 134 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. కార్యక్రమంలో పీజీ కాన్వొకేషనల్ అడిషనల్ కంట్రోలర్ డాక్టర్ బి.సాయిలు, ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య గంటా చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్. ఆరతి, కె.అపర్ణ, లావణ్య, డైరెక్టర్ పీఆర్వో డాక్టర్ పున్నయ్య పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED
★Nursing staff ANM/B.Sc. Nursing staff & ICU & Receptionist for Hospital Contact No. 87903 32690/ 9346605125
NTZ-318807

WANTED
★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.